# మునిపల్లెలోని మానవుడు



అప్పటిదాకా బాగానే వెళుతున్న మచిలీపట్నం - గుంటూరు పాంసింజర్‌కి - అంతలో ఏమయిందో ఏమో - మంగళగిరి స్టేషన్ ఇంకా రెండు మూడు ఫర్లాంగులుండగా ఆగిపోయింది.

చిన్నగా విసుక్కున్నారు చిదంబరం గారు - కిటికీలోంచి బయటకు చూస్తూ.

'అదండీ మాష్టారూ - స్ట్రైయిక్ కదా అని యూనివర్సిటీ పదిహేడు దాకా క్లోజ్ చేశారు. అందుకనే ఇంత అర్థాంతరంగా బయల్దేరుతున్నాం' - గొట్టం పాంటు వేసుకున్న స్టూడెంట్ - ఖద్దరు లాల్చీ వేసుకొన్న ఆయనతో అంటున్నాడు.

'నువ్వు కలిపితే, నాకు జోకరే రావటం లేదు - ఈసారయినా సరిగ్గా కలుపు!' ఒక సుబ్బారావ్ తన సుందరి కళ్లలోకి చూస్తూ ముద్దగా అంటున్నాడు.

'అదివరకు ట్రెయిన్ వస్తుంటే గేటు వేసి లారీలని ఆపేవాళ్ళు - ఇప్పుడు లారీలు వస్తుంటే గేటు తీసి ట్రెయిన్లు ఆపుతున్నారు!' జోక్ వేశాడు కళ్ళజోడు చిన్నవాడు -

'అదేమిటోనండీ! నేనెప్పుడు ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తున్నా ఈ మంగళగిరి స్టేషన్ దగ్గర - అరగంట ఆగవలసిందే! ఒకవేళ బస్‌లో వచ్చామనుకోండి - గేటు మూసి బస్‌ని ఒక అరగంట ఆపిగాని వదలరు -- ఏనాటిదో నాకూ - ఈ స్టేషన్‌కి అనుబంధం!' సణుగుతున్నాడు శెట్టి.

అది మధ్యాహ్నసమయం అవటం వల్ల - చాలమంది నిద్రకి తూగుతున్నారు.

చిదంబరంగారూ నిద్ర ప్రయత్నం చేయబోయారు.

గొట్టంపాంటు స్టూడెంట్ - తలుపు దగ్గరికి వెళ్ళి - ఒకసారి బయటకు చూసి - 'గేటు రోడ్ ట్రాఫిక్‌కి మూసేశారు - మరెందుకో ఈ ఆలస్యం-' అన్నాడు.

'ట్రెయిన్ డ్రయివర్ పొద్దుట్నుంచీ స్నానం చేయలేదుట - అందుకని ఇక్కడ ఆపి స్నానం చేస్తున్నాడు. అదిగో!' - దూరంగా బావి దగ్గర స్నానం చేస్తున్న ఎవర్నో చూపించి - మళ్ళీ జోక్ వేశాననుకున్నాడు కళ్ళజోడు చిన్నవాడు -

ఫక్కున నవ్వింది - పేకముక్క తీస్తున్న సుందరి -

కళ్ళజోడు చిన్నవాడు స్టైయిల్‌గా కళ్ళజోడు సరిజేసుకొన్నాడు.

'ఇస్పేటు మదాం!' అన్నాడు  జోకర్ కట్‌చేసి సుబ్బారావ్.

ఖద్దరు లాల్చీ ఆయన - చుట్ట వెలిగించి - దిన పత్రికలో వియత్నాం వార్‌లో వున్నాడు.

'రెండు కళ్ళూ లేవు - రామయ్యా రామా! దరమ ప్రభువులు మీరు - రామయ్యా రామా...'

పాట మంచి జోరుగా సాగుతోంది. దానికి తోడు 'టక్' 'టక్' మని పక్కవాయిద్యం మంచి 'ఎఫెక్ట్'ని ఇస్తున్నది పాటకి. చిదంబరం గారు మళ్ళీ విసుక్కున్నారు.

ఒక బిచ్చగత్తె - ఆమె చంకలో పిల్లవాడు - చేతిలో ఒక డబ్బా. ఆమె భుజం మీద చేయివేసి నడుస్తున్న ఒక గుడ్డివాడు. ఇద్దరూ కలసి ఆ పాటని యుగళగీతంలా పాడుతున్నారు. గుడ్డివాడు చేతిలోని వాయిద్యాన్ని - టక్ టక్ మనిపిస్తున్నాడు. బిచ్చగత్తె డబ్బాని ఆడిస్తోంది. కొద్దిగా చిల్లర డబ్బులు డబ్బాలో వున్నయ్ కాబోలు, డబడబా అంటున్నది డబ్బా. చంకలో పిల్లవాడు అమాయకంగా నిద్రపోతున్నాడు.

'భలే హిట్ సాంగ్ గురూ! ఈ మధ్య ఏ సినిమాలో వుంది ఇటు వంటి పాట!' అంటున్నాడు కళ్ళజోడు చిన్నవాడు - తన ఫ్రెండ్‌తో.

నల్లగా, నగ్నంగా, నిగనిగలాడుతున్న బిచ్చగత్తె పొట్టనీ, నడుమునీ, భుజాల్నీ ఓరగంట చూస్తున్నాడు శెట్టి. బిచ్చగత్తె ఇవన్నీ గమనించకుండా - తన భర్త వాయిద్యానికి - గాత్రధారణ చేస్తోంది. చంకలో కుర్రవాడు నిద్రలో నవ్వుతున్నాడు. ఆమెనే నమ్ముకొని - ఆమె అడుగులో అడుగు వేస్తూ - ఆమెనే ఆధారం చేసుకొని జీవితం సాగిస్తున్న ఆ గుడ్డివాడు నోటితో పాడుతూనే, చేత్తో వాయిద్యాన్ని మ్రోగిస్తున్నాడు.

చిదంబరంగారు, అదోరకంగా వారిద్దరినే గమనిస్తున్నారు.

ఇంతలో గుడ్డివాడు దారికి అడ్డంగావున్న ఒక పెట్టె అడ్డు తగిలి బొక్క బోర్లా పడ్డాడు. చేతిలోని వాయిద్యం, సీటు క్రిందకి జారిపోయింది. వాడి ముఖానికి గాయమయింది. ఆమె తన మిస్‌గైడెన్స్‌కి నొచ్చుకున్నట్టుంది, ఎంతో బాధపడిపోయింది. చటుక్కున తన భర్తను లేవదీసింది.

'దెబ్బ తగిలిందా! పాపిష్టిదాన్ని సూణ్ణేదు మావాఁ!' అంది విలవిల్లాడుతూ.

ఆమె కళ్లల్లో తిరుగుతున్న నీటిని స్పష్టంగా చూశారు - చిదంబరంగారు.

'సర్లాయె! దెబ్బాలేదు - యాంలేదు. ఎందుకట్టా గాభరాపడిపోతావ్!' అన్నాడు గుడ్డివాడు, తగిలిన గాయాన్ని కప్పిపుచ్చుతూ. తనకి కనపడదు కనుక, ఆ గాయం ఎవరికీ కనపడదు అనుకున్నట్టున్నాడు ఆ గుడ్డివాడు - కళ్ళు మూసుకు పాలు త్రాగే పిల్లిలా.

'ఏందిమామా! తగల్లేదంటావ్ - ఎట్టా రక్తమొస్తుందో సూడు!' తన ఒంటి మీద వున్న కొద్ది చీరలో -- ఇంకొంచెం చించి - గబగబా కట్టు కట్టింది.

తిండి బట్టా లేకపోయినా - వున్న కొద్ది పమిటె చెంగునీ సరిగ్గా కప్పుకొన్నదామె.

శెట్టి అటూ ఇటూ చూసి కొద్దిగా ముందుకి జరిగాడు.

ఆమె సీటు క్రిందపడ్డ వాయిద్యాన్ని అందించింది తన భర్తకి.

మళ్ళీ ప్రారంభమయింది పాట. కాని మొదట వున్నంత జోరుగా లేదు. గాయం బాధపెడుతున్నట్టుంది - పక్క వాయిద్యం కొంచెం బిగ్గరగా వినిపిస్తున్నది.

చిదంబరంగారు వాళ్ళ అనుకూల దాంపత్యానికి ఆశ్చర్యపోయారు. తన భర్తవల్ల ఏమీ వుపయోగం లేకపోయినా, తన భర్తనే నమ్ముకొని అతనితోపాటు కష్టాలను అనుభవిస్తున్న ఆమెను మెచ్చుకోకుండా వుండలేకపోయారు. యిద్దరు తమ బాధల్ని కప్పిపుచ్చుకొని, కుటుంబ పోషణకి పాటుపడటం చూసి విస్మయం పొందారు. వారి ఆదర్శ జీవితానికి చిహ్నం - పసివాడు - ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

'బాబూ! ఒక పైసా దరమం సేయండిసామీ!' దీనంగా అడుగుతున్నది బిచ్చగత్తె.

చిల్లరకోసం జేబు తుడుముకున్నారు చిదంబరంగారు. చిల్లర డబ్బులు డబ్బాలో వేశారు.

శెట్టి నిద్ర నభినయించాడు - ధర్మం చేయటం ఇష్టంలేక.

కళ్ళజోడు చిన్నవాడు ముఖం చిట్లించాడు - ఇప్పుడు డబ్బేమిటన్నట్టుగా.

'అయ్యా! పొద్దుట్నించీ ఒక్కమెతుకు తినలేదు సామీ! మీ పేరు సెప్పుకుంటాం బాబూ

- ఒక పైసా దరమం సేయండి సామి!' - బ్రతిమిలాడుతున్నది బిచ్చగత్తె.

కాసేపు చూసి - ఎలాగోలా వదిలించుకుందామని - ఏదో చిల్లర పడేశాడతను గొణుగుతూ.

చుట్ట ఆరిపోయింది కాబోలు - గట్టిగా విసుక్కొని - ఆ విసుగుని బిచ్చగత్తె మీద చూపించాడు - ఖద్దరు లాల్చీ ఆయన.

'కార్డ్ ఆర్ కౌంట్!' కళ్ళెగరేస్తూ అన్నాడు సుబ్బారావ్ - బిచ్చగత్తెను గమనించకుండా.

ముక్కును గమ్మత్తుగా ఆడించి 'షో!' అంది సుందరి కార్డ్స్ చూపిస్తూ.

'అప్పుడే!' అంటూ, బిచ్చగత్తెని విసుక్కున్నాడు - సుబ్బారావు 'ఫో' అంటూ.

గుడ్డివాడు ఎందుకో సన్నగా నవ్వుకున్నాడు.

చిన్నబుచ్చుకున్న బిచ్చగత్తె మళ్ళీ అతన్ని అడగలేదు.

మళ్ళీ యథాప్రకారం పాట పాడుతూ బయలుదేరారు ఆమె, గుడ్డివాడు.

చిదంబరంగారు - ఆమె చంకలో ప్రశాంతంగా నిద్రపోతున్నా - దీనంగా వున్న ఆ పిల్లవాడి ముఖాన్నే చూస్తున్నారు.

శెట్టి కళ్ళు తెరచి నున్నగా నగ్నంగావున్న ఆమె వీపునీ, చేతుల్నీ చూస్తున్నాడు.

కళ్ళజోడు చిన్నవాడు పేక ముక్కలు వేస్తున్న సుందరి అందమైన చేతివేళ్ళను - అదే పనిగా చూస్తున్నాడు.

ముక్కలు లెఖ్ఖపెట్టి 'పధ్నాలుగు! మళ్ళీ వెయ్!' విసుక్కున్నాడు సుబ్బారావు.

ఖద్దరు లాల్చీ ఆయన, కిటికీలో నించి తల బయటకు పెట్టి తుపుక్కున వుమ్మేశాడు, పోయిన ఎలక్షన్స్‌లో తనెందుకు ఓడిపోయిందీ, ఊహించుకుంటూ.

చిదంబరంగారు కిటికిలోనించి బయటకు చూశారు.

గొట్టంపాంటు స్టూడెంట్ - ట్రెయిన్ పై చాక్‌పీస్‌తో "ఎ.బి.వి.పి." అని వ్రాస్తున్నాడు రైలు బండిమీద. ఎండ పిచ్చివాడి కోపంలా - తీవ్రంగా ఉంది.

అప్పటి దాకా - ఈ కంపార్టుమెంటు దగ్గరవున్న కుక్క - ప్రక్క కంపార్టుమెంటు దగ్గర - బయట పారేసిన పొట్లాన్ని నాకుతున్నది - అప్పుడే తన పార్టీ నుంచి - మరొక పార్టీకి మారిన ఎమ్మెల్యే పోజులో-

ఆ కంపార్టుమెంటులో అడుక్కోవటం అయిపోయింది కావును - దంపతులు కంపార్టుమెంటు మారే ప్రయత్నంలో వున్నారు.

ఆమె పిల్లవాడిని  భర్తకి అందించి, ముందు తను రైలు దిగింది - తరువాత పిల్లవాణ్ణి అందుకుంది. అప్పటిదాకా - నిశ్శబ్దంగా వున్న ఇంజను - ఒక్క సారిగా కూత పెట్టింది - 'ఎక్కండి - ఇక బయల్దేరదాం!' అన్నట్టుగా-

'బండి కదలబోతావుంది మావాఁ! దిగు! దిగు!' అన్నది గాబరాగా ఆమె.

మళ్ళీ పెద్దగా కూత పెట్టింది ఇంజను.

అతను ట్రెయిన్ దిగుతున్నాడు - హడావిడిగా తడుముకుంటూ.

గార్డు విజిలేసి - పచ్చజెండా వూపుతున్నాడు-

'జాగ్రత్తమావాఁ!' - అంటున్నది బిచ్చగత్తె కంగారుగా.

ఇంతలో నిక్కర్ - బనీన్ వేసుకొన్న ఒక కుర్రవాడు - ఆమె చేతిలోని డబ్బాని లాక్కొని - వుడాయించాడు - తన భర్తని, క్రిందకి దించే యత్నంలో వున్న ఆమెకి - ఒక క్షణం నోట మాట రాలేదు. మెల్లగా కూడబలుక్కొని, పెద్దగా అరిచిందామె - "దొంగ! దొంగ - పట్టుకోండి!" అని.

ఈ మాటలు విన్న గుడ్డివాడు, ఏదో చేద్దామనుకొని, ఏమీ చేయలేక, ఒక్కసారిగా నీళ్ళుగారిపోయాడు. ఆమె ఏడుపు లంకించుకొంది.

ఇవన్నీ ప్రత్యక్షంగా చూస్తూన్న చిదంబరంగారూ అరిచారు' దొంగ! దొంగ - పట్టుకోండి, పరుగెత్తు తున్నాడు!' అని -

శెట్టి, ఖద్దరు లాల్చీ, కళ్ళజోడు చిన్నవాడూ, సుందరీ, సుబ్బారావూ, తన వెనకాల జేరి సోద్యం చూస్తున్నారు.

'ఎక్కడసార్! ఎవరి పర్స్ కొట్టేశారు' అన్నాడు కళ్ళజోడు చిన్నవాడు చివరికి.

'ఆ బిచ్చగత్తె డబ్బాని అందుకొని పరుగెత్తుతున్నాడు రాస్కెల్! వాడికిం కెవరూ దొరకలేదూ దొంగతనం చేయటానికి. ఎవరన్నా వెంటపడి వాణ్ణి పట్టుకోండి!' అరిచారు చిదంబరంగారు వాళ్ళ స్వల్పార్జితం, కష్టార్జితం, ఒక క్షణంలో అలా, అన్యాయంగా పోవటం చూసి.

ఇంజను, ఇంకా బిగ్గరగా కూతపెట్టింది ఈసారి-

'అఁ! ఎంతసార్! ఒక రూపాయో ఎంతో వుంటుంది దాంట్లో, ఆమాత్రానికే లేనిపోని గొడవలెందుకు!' అని ఖద్దరు లాల్చీ ఆయన అమెరికా వియత్నాం వార్ మీద ఇచ్చిన స్టేట్మెంట్ని వల్లెవేయటం ప్రారంభించాడు.

'వాళ్ళు మంచివాళ్ళు కాదు సార్! వాళ్ళదగ్గర కత్తులు కూడ వుంటయ్‌ట!' వెళ్ళి కూర్చున్నాడు

శెట్టి.

వెంటబడదామనుకున్న సుబ్బారావ్‌ను 'మనకెందుకండీ - అనవసరంగా, అందరూ వూరుకున్నప్పుడు, అని సుందరి, సుబ్బారావ్‌ని బలవంతాన కూర్చోపెట్టి, పేక ముక్కలు కలపసాగింది.

సుబ్బారావ్ - సుందరి కాలి బొటన వేలితో నేల మీద గీస్తున్న గీతనే చూస్తున్నాడు, ఆ గీతని దాటనన్నట్టుగా.

తన వెనక ఎవరూ రావటం లేదని నిర్ధారణ చేసుకొన్ని ఆ దొంగ వెధవ పొలాల్లో తాపీగా నడచి వెళ్ళటం దూరం నుంచి కనపడుతూనే వుంది.

"ముసలివాడి నయినా, వెంటపడి, వాడిని పట్టుకొని వుండేవాడిని, హుఁ! ఏం లాభం! అన్నీ చూస్తూ అసహాయుడిలా ఊరుకోవలసి వచ్చింది!" - తన అవిటికాలుని చూసుకొని విచారించారు చిదంబరంగారు.

బిచ్చగత్తె పెద్దగా ఏడుస్తూ వుంది. 'ఈయాల - నానోటి దగ్గర కూడు కాజేసిండు దొంగ నాయాల' - ఏవేవో బూతులు తిడుతున్నది.

'పోన్లేయే! మనకియ్యాల కూడు ప్రాప్తం లేదు! బాద పడమాక" ఓదార్చుతున్నాడు గుడ్డివాడు తన భార్యని.

'రాత్రల్లా నిద్రలేదుసార్! ఆ పాడు ఎక్స్‌ప్రెస్‌లో చోటులేక నుంచొని వచ్చాం - వాల్టేర్ నుంచీ బెజవాడ దాకా - దానికి తోడు ప్రొద్దున్నించీ భోజనం చేయలేదు! అందుకని కొద్దిగా కళ్ళు తిరుగుతున్నయ్! లేకపోతే నేనే వెళ్ళి ఆ దొంగ రాస్కెల్‌ని పట్టుకొని వుండేవాడిని! అయామ్ సారీసార్!' అన్నాడు కళ్ళజోడు చిన్నవాడు తన అసమర్థతకి నొచ్చుకుంటూ.

నిర్లిప్తంగా వూరుకున్నారు - చిదంబరంగారు, అతని 'హరికథ' విని.

ఏ విషయమూ పట్టించుకోకుండా బయలుదేరింది ట్రెయిన్. టూర్ పూర్తిచేసుకు బయలుదేరుతున్న మినిష్టర్‌గారిలా. ట్రెయిన్ మోతకి - తోడయింది బిచ్చగత్తె ఏడుపు. మొగుడి ఓదార్పు.

ఒకసారి పెద్దమనుష్యులందరి వంకా చూశారు చిదంబరంగారు.

ఖద్దరు లాల్చీ ఆయన - షేక్ అబ్దుల్లాని వదలటంలో భారత ప్రభుత్వం ఏమయినా పొరపాటు చేసిందా అని ఆలోచిస్తూ, తాపీగా చుట్ట త్రాగుతున్నాడు.

శెట్టి ఏడుస్తున్న ఆ బిచ్చగత్తె శరీరపుటొంపుల్ని చూస్తున్నాడు కన్నార్పకుండా.

సుబ్బారావ్ - ఇబ్బందిగా తల వంచుకున్నాడు - తన భార్య కాలిగోటిని చూస్తూ.

సుందరికి కసిగా పేకముక్కలు కలుపుతున్నది.

కళ్ళజోడు చిన్నవాడు - ఎర్రని పండు మిరపచేనులోని నల్లని పడుచుని అదేపనిగా చూస్తున్నాడు.

గొట్టంపాంటు కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి ట్రెయిన్ ఎక్కుతున్నాడు.

చటుక్కున చిదంబరంగారు పర్సులోనించి పది రూపాయల నోటు తీశారు. ఆమెను పెద్దగా కేకేసి - కిటికీలోనించి విసిరేశారు నోటుని.

రైలు స్పీడందుకుంది.

ఆ డబ్బు అందుకుని నమస్కరిస్తున్న ఆమెని చూసి తృప్తిగా నిట్టూర్చారు చిదంబరంగారు.

●

*(వాణిశ్రీ మాసపత్రిక: జనవరి, 1968)*